క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

బెల్లంకొండ: మండలంలోని బెల్లంకొండ, పాపాయపాలెం సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాలలో బుధవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని బెల్లంకొండ ఏఈ పవన్‌కుమార్ తెలిపారు. 33/11 కేవీ లైన్లకు మరమ్మతులు చేపట్టనున్న కారణంగా ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు మండలంలోని అన్ని గ్రామాలలో విద్యుత్ సరఫరా నిలిపివేసున్నట్లు పేర్కొన్నారు. వినియోగదారులు, రైతులు సహకరించాలని కోరారు.

ర్యాగింగ్ చట్టరీత్యా నేరం

ఎస్ఐ చల్లా సురేష్



నకరికల్లు: ర్యాగింగ్‌కు గురైతే అధైర్య పడవద్దని వెంటనే ఉపాధ్యాయులకు, పోలీస్‌లకు సమాచారం ఇస్తే ర్యాగింగ్‌కు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ చల్లా సురేష్ తెలిపారు. స్థానిక కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాల విద్యార్థినులకు ర్యాగింగ్ పర్యవసానాలు, చట్టం తీసుకునే చర్యలపై మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాలయాలు దేవాలయాల లాంటివన్నారు. సీనియర్, జూనియర్ అంటూ ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలకు బాధ్యులవుతారన్నారు. తోటి విద్యార్థులతో ప్రేమ, స్నేహపూర్వక భావంతో మెలగాలన్నారు. ర్యాగింగ్ చట్టరీత్యా నేరమని అందరూ గుర్తించాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ లక్ష్మి, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

తొండపిలో పీజీఆర్ఎస్ అర్జీపై విచారణ



తొండపి(ముప్పాళ్ళ): మండలంలోని తొండపి గ్రామంలో ఇనాం భూములు రిజిస్ట్రేషన్ చేసుకున్నారంటూ గ్రామానికి చెందిన దుగ్గినేని వెంకట్రావు ఇచ్చిన ఫిర్యాదుతో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సత్తెనపల్లి ఆర్డీవో జీవీ రమణకాంత్‌రెడ్డి, తహసీల్దార్ కే నగేష్, ఎండోమెంట్స్ అధికారి బండి శ్రీనివాసరావులు మంగళవారం విచారణ చేపట్టారు. ఫిర్యాదుదారుడు తెలిపిన భూమి వద్దకు వెళ్లి రికార్డులు పరిశీలించారు. గ్రామానికి చెందిన రాయిడి అప్పయ్య 2017లో 11 ఎకరాల 38 సెంట్ల భూమిని తొమ్మిది మంది సభ్యులతో ట్రస్ట్‌గా ఏర్పాటు చేసుకున్నారు. సదరు భూమి ద్వారా వచ్చే ప్రతిఫలాన్ని రాయిడి కుటుంబీకులు వారి అవసరాల నిమిత్తం ఉపయోగించుకునేలా ట్రస్ట్‌లో పొందుపరిచినట్లుగా గుర్తించారు. ట్రస్ట్ సభ్యులతో మాట్లాడి వారి వద్ద నుంచి రికార్డులు పరిశీలించారు. సదరు భూమికి ఎండోమెంట్స్‌కు ఎలాంటి సంబంధం లేదని గుర్తించారు. ఎలాంటి రిజిస్ట్రేషన్‌లు జరగటం లేదని విచారణలో గుర్తించి వివరాలు నమోదు చేసుకున్నారు. విచారణలో గుర్తించిన అంశాలపై నివేదిక తయారు చేసి ఉన్నతాధికారులకు అందించటం జరుగుతుందని తహసీల్దార్ నగేష్ తెలిపారు. ఆర్ఐ ఆంజనేయులు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మా రోడ్డును బాగు చేయండి...

- అధ్వాన్నంగా మారిన 88త్యాళ్లూరు ఆర్ అండ్ బీ రహదారి
- ఆర్టీసీ, స్కూల్ బస్సులు, ఆటోలు, లారీలతో నిత్యం రద్దీ
- కుంగిపోయిన రోడ్డు, మూతపడ్డ సైడు డ్రైన్లు
- పట్టించుకోని అధికారులు



88త్యాళ్లూరు గ్రామంలో ఆర్ అండ్ బీ రహదారి దుస్థితి

88త్యాళ్లూరు(క్రోసూరు): మండలంలోని 88త్యాళ్లూరు గ్రామం నడిబొడ్డు గుండా వెళ్లే ఆర్ అండ్ బీ రహదారి అధ్వాన్నంగా మారింది. ప్రజలు ఈ రోడ్డుపై ప్రయాణించేందుకు నానా అవస్థలు పడుతున్నారు. గ్రామం మధ్యలోని శివాలయం దగ్గర నుంచి సుమారు కిలోమీటరు ఇళ్ల మధ్యగా రోడ్డు వెళ్తుంది. ఈ రోడ్డు పూర్తిగా కుంగిపోయి సైడు డ్రైనేజీలు సైతం ధ్వంసం అయ్యాయి. చిన్నపాటి వర్షం వచ్చినా, కాలువలు పూడుకుపోవటంతో వర్షం నీరు, మురుగు రోడ్డు మీదే నిలబడుతుంది. భారీ ఇసుక లారీలు ఈ రోడ్డుపై వెళ్తుండటంతో రోడ్డు పాడైపోయిందని, పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయని ప్రజలు అంటున్నారు.

+ ఈ రోడ్డు మీదగా 88త్యాళ్లూరుకు ఎగువన ఉన్న ఉయ్యందన, గుడిపాడు గ్రామాల ప్రజలు, కాలేజీ, పాఠశాలల విద్యార్థులు, 88త్యాళ్లూరు జెడ్పీ పాఠశాల, అదేవిధంగా క్రోసూరు, సత్తెనపల్లి వైపు ప్రయాణాలు చేస్తుంటారు. స్కూలు బస్సులు, ఆర్టీసీ బస్సులు, ఆటోలు ఈ మార్గంలోనే ప్రయాణించాలి. నిత్యం రద్దీగా ఉండే రోడ్డు పాడై చాలా కాలమవుతున్నా అధికారులు పట్టించుకోవటం లేదని గ్రామ ప్రజలంటున్నారు. ఆర్ అండ్ బీ ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు రోడ్డును తక్షణమే పర్యవేక్షించి వెంటనే బాగు చేయటం గానీ కొత్తగా వేయటం గానీ చేయాలని ప్రజలు కోరుతున్నారు.

అంచనాలు వేశాం

రోడ్డు మరమ్మతుల కొరకు మెయింటెనెన్స్ అంచనాలు వేయటం పూర్తి అయింది. అందుకు సంబంధించిన టెండర్ల ప్రక్రియ పూర్తి అయితే వెంటనే పనులు చేపడతాం. రోడ్డు పనులు చేసేందుకు సిద్ధంగా ఉన్నాం.

– పున్నారావు, ఆర్ అండ్ బీ ఏఈ, క్రోసూరు

పూర్తిగా గోతుల మయం



గ్రామంలో రోడ్డు పూర్తిగా గోతుల మయమైంది. వృద్ధులు, మహిళలు, పిల్లలు తరచూ పడి ప్రమాదాలకు గురవుతున్నారు. ద్విచక్ర వాహనదారులకు కూడా రాత్రి సమయాల్లో ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది.

– మోదెల వేణుగోపాలస్వామి, 88త్యాళ్లూరు

రోడ్డు బాగు చేయాలి



లారీలు, బస్సులు నిత్యం ఈ రోడ్డుపై వెళ్తున్నాయి. రెండు గ్రామాల ప్రజలకు ఇదే ఆధారం. సైడు డ్రైన్లు వేసి రోడ్డును అధికారులు వెంటనే బాగు చేయాలి.

– బోడపల్లి మణికుమార్, 88త్యాళ్లూరు

సమస్యలు పరిష్కరించాలని ఆర్టీసీ ఉద్యోగులు నిరసన



డిపోలో నిరసన తెలుపుతున్న ఆర్టీసీ ఎన్ఎంయూ నాయకులు

సత్తెనపల్లి: ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలంటూ ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో పట్టణంలోని ఆర్టీసీ డిపోలో రెడ్ బ్యాడ్జీలు ధరించి మంగళవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆర్టీసీ ఉద్యోగుల నేషనల్ మజ్దూర్ యూనియన్ నాయకులు మాట్లాడుతూ విజయవాడ గవర్నర్‌పేట–2 డిపోకు చెందిన 4.15 ఎకరాల స్థలాన్ని లులూ మాల్‌కు బదలాయిస్తూ ప్రభుత్వం ఇచ్చిన జీవోను ఉపసంహరించుకోవాలన్నారు. తక్షణమే పీఆర్సీ కమిషన్‌ను ఏర్పాటు చేయాలని, ఐఆర్ ప్రకటించాలని, పెండింగ్ డీఏలను చెల్లించాలన్నారు. సుమారు 8 వేల ఖాళీలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ప్రమోషన్స్ ఇవ్వాలని, గ్యారేజీ ఉద్యోగుల, రిటైర్ అయిన ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలన్నారు. మహిళా ఉద్యోగులకు పిల్లల సంరక్షణ సెలవు మంజూరు చేయాలన్నారు. అనారోగ్య సెలవులకు పూర్తి జీతం చెల్లించాలని, ఈహెచ్ఎస్ స్థానంలో పాత వైద్య విధానాన్ని పునరుద్ధరించాలన్నారు. ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు వేతనాలు చెల్లించాలని, పారదర్శకమైన బదిలీల పాలసీని అమలు చేయాలన్నారు. ఆయా సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆర్టీసీ ఉద్యోగుల నేషనల్ మజ్దూర్ యూనియన్ డిపో సెక్రటరీ ఎన్.నాగేశ్వరరావు, ప్రెసిడెంట్ జి.దుర్గారావు, వి.వెంకయ్య, జిల్లా కమిటీ మెంబర్ సుధాకరరావు, ఉద్యోగులు తదితరులు ఉన్నారు.

అక్రమంగా మట్టి తరలిస్తున్న పొక్లెయిన్ సీజ్



నకరికల్లు: అక్రమంగా మట్టి తరలిస్తున్న వాహనాలను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు తహసీల్దార్ కె.పుల్లారావు తెలిపారు. మండలంలోని త్రిపురాపురం సమీపంలోని సర్వే చేయని భూమిలో అక్రమంగా మట్టి తరలిస్తున్నట్లు సమాచారం అందిందన్నారు. ఈ మేరకు మంగళవారం రెవెన్యూ, మైనింగ్, పోలీస్ సిబ్బందితో దాడులు నిర్వహించినట్లు తెలిపారు. మట్టిని తరలిస్తున్న పొక్లెయిన్, ట్రాక్టర్‌ను సీజ్ చేసి స్వాధీనం పరుచుకొని కేసు నమోదు చేశామన్నారు. ఎవరైనా ప్రభుత్వ భూములు, అనుమతులు లేకుండా అక్రమంగా మట్టి తరలిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. దాడుల్లో ఆర్ఐ సిద్దయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

ఒక్క మాత్రతో బాలల భవితకు రక్షణ

అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, కళాశాలల్లో ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ

సత్తెనపల్లి: నులిపురుగులు చిన్నారులను శక్తిహీనులుగా మార్చేస్తాయని, ఒక్క ఆల్బెండజోల్ మాత్ర బాలల భవితకు రక్షణగా నిలుస్తుందని పణిదం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ యుఎల్ఎస్ కవిత అన్నారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవంలో భాగంగా మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో 19 సంవత్సరాల లోపు పిల్లలకు మంగళవారం ఆల్బెండజోల్ మాత్రలను మింగించారు. మండలంలో 10,813 మందిని గుర్తించగా 10,436 మందికి ఆల్బెండజోల్ టాబ్లెట్లు మింగించారు. డాక్టర్ కవిత మాట్లాడుతూ నులిపురుగుల కారణంగా పిల్లల్లో ఎదుగుదల లోపించడం, రక్తహీనత, ఆకలి మందగించడం ఉంటాయన్నారు. డాక్టర్ సాయితేజ రెడ్డి, డాక్టర్ పి.గౌతమి మాట్లాడారు. రామకృష్ణాపురంలోని బాలుర గురుకులంలో డాక్టర్ పి.గౌతమి, పణిదం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో డాక్టర్ కవిత, డాక్టర్ సాయితేజ రెడ్డి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎంపీడీవో బండి శ్రీనివాసరెడ్డి, ఎంఈవో ఏ శ్రీనివాసరావు, ఆరోగ్య విస్తరణాధికారి పి.శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, సీహెచ్‌వోలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆరోగ్య, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



రామకృష్ణాపురంలో...



అమరావతిలో...



నకరికల్లులో...

నులిపురుగుల నివారణతో పిల్లల్లో సంపూర్ణ ఆరోగ్యం

జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ బి.గీతాంజలి



ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ పరిశీలిస్తున్న జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ గీతాంజలి

రాజుపాలెం: నులిపురుగుల మాత్రలు తీసుకోవడం ద్వారా పిల్లలు మానసికంగా, శారీరకంగా ఆరోగ్యంగా ఉంటారని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ బి.గీతాంజలి అన్నారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా మంగళవారం మండలంలోని గణపవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చేపట్టిన నులిపురుగుల మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని ఆమె పరిశీలించి, మాట్లాడుతూ మండలంలో 19 ఏళ్ల లోపు వయస్సు గల పిల్లలు 8,968 మందిని గుర్తించగా 8,546 మందికి ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయడం జరిగిందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, కళాశాలల్లో మాత్రల పంపిణీ జరిగిందన్నారు. ఎంపీడీవో సత్యనారాయణ, ఎంఈవో మల్లిఖార్జునశర్మ, నరసింహారావు, పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ రవి పాల్, రవితేజానాయక్, హెచ్ఎం టి.ఉషారాణి, ఆరోగ్య పర్యవేక్షకులు జీవన్‌రావు, సీహెచ్‌వో అలేఖ్య, ఏఎన్ఎం సరళ, ఆశాకార్యకర్తలు అనురాధ, సంతోషం తదితరులు పాల్గొన్నారు.

అమరావతిలో...

అమరావతి: మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో మంగళవారం జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. అత్తలూరు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో స్థానిక అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో ఎంపీపీ మేకల హనుమంతరావు విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను ఇచ్చి కార్యక్రమాన్ని ప్రారంభించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి శివరత్నకుమార్ మాట్లాడుతూ మండలంలో సుమారు 13,000 మంది పిల్లలు ఉండగా 12,342 మందికి పంపిణీ చేశామన్నారు. ఎంఈవో శివబాబు, ఆరోగ్య సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రోసూరులో...

క్రోసూరు: జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం పురస్కరించుకుని క్రోసూరు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మండలంలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ, ప్రైవేటు, పాఠశాలలు, కాలేజీ విద్యార్థులకు మంగళవారం ఆల్బెండజోల్ మాత్రలు వేసే కార్యక్రమం నిర్వహించినట్లు పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ సాద్, డాక్టర్ సిరిచందన తెలిపారు. దొడ్లేరు జెడ్పీ పాఠశాలలో ఆరోగ్య సిబ్బందితో కలిసి ఆరోగ్య విస్తరణాధికారి శిఖాశ్యాంసన్ ఆల్బెండజోల్ మాత్రలు వేశారు. 19 సంవత్సరాల లోపు పిల్లలు 14 వేల మంది ఉండగా, 90 శాతం పూర్తి చేసినట్లు తెలిపారు.

నకరికల్లులో...

నకరికల్లు: పొట్టలోని నులిపురుగులను నివారిస్తే అనారోగ్యాలు దరిచేరవని పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ మణికంఠ సూచించారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం పురస్కరించుకొని పాఠశాలల్లోని విద్యార్థులు, ఇంటింటికి వెళ్లి ఆల్బెండజోల్ మాత్రలను మంగళవారం పంపిణీ చేశారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మాత్రల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రతి ఒక్కరూ నులిపురుగుల మాత్రలు మింగాలని సూచించారు. ఆయా గ్రామాల సిబ్బంది పాల్గొన్నారు.

బెల్లంకొండలో...

బెల్లంకొండ: జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా మంగళవారం మండలంలోని అన్ని గ్రామాలలో ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలలో 2–19 సంవత్సరాల వయస్సు గల బాలబాలికలకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేసినట్లు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కిరణ్‌కుమార్ తెలిపారు. మండలంలోని చంద్రాజుపాలెం జెడ్పీ పాఠశాలలో ఆయన పాల్గొని మాట్లాడుతూ మండలంలో 4,651 మంది పిల్లలు ఉండగా, 4,139 మందితో మాత్రలు మింగించామన్నారు. సీహెచ్‌వో, సూపర్‌వైజర్ బాషా, ఉపాధ్యాయులు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

పాత్రికేయులపై దాడులకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలి

సీపీఎం జిల్లా నాయకుడు గంజిమాల రవికుమార్


అచ్చంపేట: పాత్రికేయులపై దాడులకు పాల్పడిన వారు ఎంతటి వారైనా వారిపై తక్షణం చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా నాయకుడు గంజిమాల రవికుమార్ డిమాండ్ చేశారు. అచ్చంపేట మండల ప్రజాశక్తి రిపోర్టర్ గుంజి రవికుమార్ ఇంటిపై ఈ నెల 8న కొందరు గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేసి, ఇంట్లో ఫర్నిచర్ ధ్వంసం చేయాడాన్ని వారు తీవ్రంగా ఖండిస్తూ ప్రజా సంఘాల మద్దతుతో మండలంలోని ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా సభ్యులు మంగళవారం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ర్యాలీగా వెళ్లి తహశీల్దారు కుంభా శ్రీనివాసరావుకు వినతిపత్రం అందచేశారు. ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా సభ్యులు, సీపీఎం, సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

తప్పిపోయిన చిన్నారి ఆచూకీ గుర్తింపు



సత్తెనపల్లి: తప్పిపోయిన చిన్నారిని రెండు గంటల్లో పోలీసులు గుర్తించి, కన్నవారికి అప్పగించారు. సత్తెనపల్లి పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పట్టణంలోని నాగన్నకుంటకు చెందిన దేవర గురవయ్య కుమార్తె నీలిమ (3) మధ్యాహ్నం 2.30 గంటల సమయంలో ఇంటి ముందు పిల్లలతో ఆడుకుంటూ అదృశ్యమైంది. తల్లిదండ్రులు పట్టణ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి విషయం చెప్పారు. టౌన్ సీఐ నరహరి నాగమల్లేశ్వరరావు వెంటనే స్పందించి, డ్రోన్ సహాయంతో కానిస్టేబులు, మరో మూడు బృందాలతో పట్టణాన్ని జల్లెడ పట్టారు. సాయంత్రం 4.30 గంటల సమయంలో నీలిమ ఏడుస్తూ 20వ వార్డులో కనిపించటంతో ఓ వ్యక్తి స్థానిక అంగన్‌వాడీ కేంద్రానికి పంపారు. ఈలోగా పోలీసులు వెళ్లి నీలిమను డీఎస్పీ మేదరమెట్ల హనుమంతరావు సమక్షంలో తల్లిదండ్రులకు అప్పగించారు. పట్టణంలోని తన కార్యాలయంలో డీఎస్పీ మాట్లాడుతూ చిన్న పిల్లల విషయంలో తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలన్నారు. పట్టణ సీఐ, ఎస్ఐ, ఇతర సిబ్బందిని ఆయన అభినందించారు.

తోటి విద్యార్థుల పట్ల సోదర భావంతో మెలగాలి



బెల్లంకొండ: కళాశాలలో విద్యార్థులు తోటి వారి పట్ల సోదరభావంతో మెలగాలని ఎస్ఐ డి.ప్రవీణ్ తెలిపారు. మంగళవారం మండల కేంద్రం బెల్లంకొండలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 'యాంటీ ర్యాగింగ్-యాంటీ డ్రగ్స్' కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ కళాశాలలో గొడవలకు దిగకుండా బుద్ధిగా చదువుకోవాలని, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. మద్యం, మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని అన్నారు. విద్యార్థులు ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సునీత, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామింగ్ ఆఫీసర్ లక్ష్మీ సులోచన, అధ్యాపక సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.

మండెపూడిలో చోరీ

అమరావతి: మండల పరిధిలోని మండెపూడి గ్రామంలో చోరీ జరిగిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గ్రామస్తులు అందించిన సమాచారం ప్రకారం మండెపూడికి చెందిన సబావత్ చిన వెంకటేశ్వరనాయక్ ఈ నెల 8వ తేదీన కుటుంబ సభ్యులతో కలిసి తిరుపతి వెళ్లారు. తిరిగి సోమవారం (11వ తేదీ) సాయంత్రం మండెపూడిలోని ఇంటికి చేరుకునే సరికి ఇంటి తాళాలు పగులగొట్టి ఉండటం గమనించి అదే రోజు రాత్రి అమరావతి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై సీఐ అచ్చియ్య మాట్లాడుతూ బంగారం, వెండి వస్తువులు, కొంత నగదు మొత్తం లక్ష రూపాయల విలువైనవి చోరీ జరిగినట్లు ప్రాథమిక విచారణలో తేలిందన్నారు. ఘటనా స్థలంలో మంగళవారం క్లూస్ టీం ద్వారా ఆధారాలు సేకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.